క్లుప్తంగా

నేడు 32వ వార్డులో 'గడప గడపకు మన ప్రభుత్వం'

నూజివీడు: పట్టణంలోని 32వ వార్డులో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వార్డు కౌన్సిలర్ నవుడు నాగమల్లేశ్వరరావు గురువారం తెలిపారు. సాయంత్రం 4 గంటలకు జరిగే కార్యక్రమంలో ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు పాల్గొని సంక్షేమ పథకాలను వివరిస్తారన్నారు..

15లోగా లైఫ్ సర్టిఫికెట్లు అందజేయాలి

తిరువూరు: ప్రభుత్వం ద్వారా పెన్షను పొందుతున్న రిటైర్డు ఉద్యోగులు ఈ నెల 15వ తేదీలోగా లైఫ్ సర్టిఫికెట్లు ఉపఖజానా కార్యాలయంలో అందజేయాలని తిరువూరు రిటైర్డు ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు ఎండీ కమృద్దీన్ తెలిపారు. ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరిలో లైఫ్ సర్టిఫికెట్లు ఇవ్వని వారు ఇప్పుడు సర్టిఫికెట్లు ఇవ్వాలన్నారు. ఈకేవైసీ చేయించుకోవాలని, తమ ఆధార్, పాన్ కార్డులతో అనుసంధానమైన ఫోన్ నంబరుతో ఉపఖజానా అధికారిని సంప్రదించాలని సూచించారు.

వేణుగోపాలరావుకు ఎమ్మెల్యే వసంత పరామర్శ



మైలవరం: మండల పరిధిలోని తోలుకోడు గ్రామ సొసైటీ చైర్మన్, వైఎస్సార్ సీపీ నాయకుడు చెలికాని వరదా వేణుగోపాలరావు ఇటీవల అనారోగ్యానికి గురై మంగళగిరి ఎన్ఆర్ఐ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ గురువారం వేణుగోపాలరావును ఆస్పత్రిలో పరామర్శించి, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

వైభవంగా నృసింహ జయంతి

ఆగిరిపల్లి: ఉమ్మడి కృష్ణా జిల్లాలోని ఆగిరిపల్లిలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ శోభనాచల వ్యాఘ్రలక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో గురువారం నృసింహ జయంతిని వైభవంగా నిర్వహించారు. స్వామివార్లకు పంచామృత స్నపన, విశేష అలంకరణ, లక్ష్మీ నృసింహ మూలమంత్ర హోమం, నీరాజన మంత్ర పుష్పం జరిపించారు. అదేవిధంగా స్వామివారి స్వయంభు ఆలయానికి వెళ్లే మెట్ల మార్గంలోని రెండో ఉపాలయంలోని శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామికి ఆలయ సంప్రోక్షణ నిమిత్తం అంకురార్పణ, వాస్తు హోమాది కార్యక్రమాలను ఆలయ అర్చకులు వేదాంతం శేషుబాబు, జి.అనంతకృష్ణ నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో కల్యాణోత్సవం

తిరువూరు: నరసింహస్వామి జయంతి సందర్భంగా తిరువూరు శ్రీరాజ్యలక్ష్మీ సమేత రంగనాయకస్వామి దేవస్థానంలో గురువారం విశేష పూజలు నిర్వహించారు. నరసింహ జయంతి విశిష్టతను ఆలయ అర్చకులు భక్తులకు వివరించారు. స్వామి వారి కల్యాణోత్సవాన్ని వేదపండితులు ఎన్‌సీహెచ్ విఠలాచార్యులు, పార్థసారథాచార్యులు ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ దారా రంగారావు పర్యవేక్షించారు.

మైలవరం ఎస్ఐగా హరిప్రసాద్

మైలవరం: ఎన్టీఆర్ జిల్లా మైలవరం ఎస్ఐగా ఎస్.హరిప్రసాద్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు పెనుగంచిప్రోలు పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా పని చేసి సాధారణ బదిలీల్లో భాగంగా మైలవరం వచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ హరిప్రసాద్ మాట్లాడుతూ.. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

నెమలి దేవస్థానం సహాయ కమిషనర్‌గా వరప్రసాద్

నెమలి(గంపలగూడెం): జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన గంపలగూడెం మండలం నెమలి శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానం ఎఫ్ఏసీ సహాయ కమిషనర్‌గా తిరుమలగిరి దేవస్థానం సహాయ కమిషనర్ ఎంకేటీఎస్ వరప్రసాద్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ ఇన్‌చార్జిగా వ్యవహరించిన తిరుమలగిరి దేవస్థానం సహాయ కమిషనర్ డి.శ్రీరామ వరప్రసాదరావు అప్పనపల్లి దేవస్థానానికి బదిలీ అయ్యారు.

సచివాలయాల్లో ఆకస్మిక తనిఖీ



తిరువూరు: తిరువూరు నగర పంచాయతీ పరిధిలోని వార్డు సచివాలయాలను కమిషనర్ బాలకృష్ణ గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. రాజుపేట, మునుకుళ్ల రోడ్, సిద్దార్థ స్కూల్ రోడ్లలోని వార్డు సచివాలయాల పరిధిలో ప్రజల సమస్యలు ఏమేరకు పరిష్కరించారో సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సచివాలయ సిబ్బంది అలసత్వంతో వ్యవహరించవద్దని, గడువు లోపల పన్నుల వసూలు లక్ష్యాలను అధిగమించాలని కమిషనర్ చెప్పారు. కార్యాలయంలో అన్ని సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాలతో కూడిన బోర్డులను అప్‌డేట్ చేసి ప్రదర్శించాలని ఆదేశించారు.

రీ సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలి

- నిర్లక్ష్యం వహిస్తే చర్యలు
- తిరువూరు ఆర్డీఓ వైవీ ప్రసన్నలక్ష్మి



గంపలగూడెంలో రీ సర్వేపై సూచనలిస్తున్న తిరువూరు ఆర్డీఓ ప్రసన్నలక్ష్మి

గంపలగూడెం: జగనన్న శాశ్వత భూ హక్కు – భూ రక్ష పథకంలో భాగంగా రెండో విడత ఎంపికైన గ్రామాల్లో భూ రీసర్వేను సిబ్బంది సమర్థవంతంగా నిర్వహించాలని తిరువూరు ఆర్డీఓ వై.వి.ప్రసన్నలక్ష్మి ఆదేశించారు. భూ రీసర్వేపై వీఆర్వోలు, సచివాలయ సర్వేయర్లుతో గురువారం గంపలగూడెం వైఎస్సార్ క్రాంతిపథం కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. రెండో విడత భూ రీసర్వే ఎన్టీఆర్ జిల్లాలోనే గంపలగూడెం మండలం వెనుకబడి ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్లక్ష్యం వహిస్తే వీఆర్వోలు, సర్వేయర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సర్వే పట్ల కొందరు సిబ్బంది బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని, పరిస్థితి ఇలానే కొనసాగితే ప్రతి రోజు అందరితో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహిస్తానని చెప్పారు.

నెలాఖరుకు ఎఫ్‌పీఓఎల్ఆర్ పూర్తి..

రెండో విడత గ్రామాల్లో గ్రౌండ్ ట్రూతింగ్‌కు ముందు ఎఫ్‌పీఓఎల్ఆర్‌ను ఏవిధమైన పొరబాట్లు లేకుండా నిబంధనల ప్రకారం పూర్తి చేయాలని ఆర్డీఓ ఆదేశించారు. అందుకు అవసరమైన పనులను ఆమె వివరించారు. ప్రభుత్వ భూములు ఆక్రమణలో ఉంటే వెంటనే స్వాధీనపర్చుకోవాలని సూచించారు. ఈవిషయమై ఎలాంటి అవకతవకలకు పాల్పడినా సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. డెత్ కేసులు, వారసత్వ ఆస్తి ఉంటే వారసులను ముందుగా గెట్లు వేసుకోమని సూచించాలన్నారు. ఇద్దరు రైతుల మధ్య ఉన్న గెట్ల తగాదాలు కూడా ఇప్పుడే పరిష్కరించి హద్దులు నిర్ణయించాలన్నారు. మాడిఫికేషన్, పీఓటీ, మ్యుటేషన్, సక్రమంగా పూర్తిచేయాలని సూచించారు. గ్రౌండ్‌ట్రూతింగ్ ప్రారంభించిన తర్వాత ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఈనెలాఖరుకు ఎఫ్‌పీఓఎల్ఆర్ పూర్తి చేయాలని ఆదేశించారు. తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి, మండల సర్వేయర్ సాంబశివరావు పాల్గొన్నారు.

గ్రామాల్లో ముమ్మరంగా రీ సర్వే

ముష్టికుంట్ల(తిరువూరు): జగనన్న భూహక్కు సర్వే పనులు మండలంలోని ముష్టికుంట్లలో వేగవంతంగా జరుగుతున్నాయి. సర్వే పూర్తయిన పొలాల్లో సరిహద్దు రాళ్ల ఏర్పాటును రెవెన్యూ శాఖ చేపట్టింది. తహసీల్దార్ సురేష్‌బాబు గురువారం సర్వే పనులను తనిఖీ చేశారు. పారదర్శకంగా సర్వే చేయాలని, రైతుల సమక్షంలోనే సరిహద్దు రాళ్ల పాతాలని సిబ్బందికి సూచించారు. డెప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే సారంగపాణి, మండల సర్వేయర్ గోపాలకృష్ణ, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గంథం పుల్లయ్య, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

తాగునీటి కొరత నివారణకు చర్యలు

ఎమ్మెల్యే కె రక్షణనిధి



తిరువూరులో సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

తిరువూరు: తిరువూరు పట్టణంలో తాగునీటి కొరత నివారణకు కృష్ణా నదీ జలాల సరఫరాకు రూ.160 కోట్లతో పైలట్ ప్రాజెక్టు పనులు జరుగుతున్నాయని స్థానిక ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి తెలిపారు. తిరువూరు నగరపంచాయతీ పరిధిలోని 20వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. పైపులైన్ల లీకేజీతో మంచినీరు కలుషితమవుతోందని, మురుగునీటి కాలువలు లేక నీరు రోడ్లపై పారుతోందని వార్డు ప్రజలు ఎమ్మెల్యేకు తెలిపారు. తాగునీటి సరఫరా లోపాల నివారణకు కొత్త పైపులైన్లు వేయడంతో పాటు ప్రతి రోజూ కుళాయిలద్వారా నీరందిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. మురుగునీటి పారుదలకు కూడా శాశ్వత ప్రణాళిక రూపొందిస్తామని త్వరలో సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి, వైస్ చైర్‌పర్సన్లు విజయలక్ష్మి, వెంకటేశ్వరి, వార్డు కౌన్సిలర్లు నదియా, వెంకటరెడ్డి, సత్యనారాయణ, సుందరకుమార్, శ్రీనివాసరావు, ప్రకాష్‌రెడ్డి, మస్తాన్, నాయకులు ఆదినారాయణ, అజీజ్, గోపీ, పాపారావు పాల్గొన్నారు.

వైద్య సేవలు అభినందనీయం



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న దేశిరెడ్డి తదితరులు

చాట్రాయి: గ్రామీణ ప్రాంతాల్లో కార్పొరేట్ ఆస్పత్రులు అందిస్తున్న ఉచిత వైద్య సేవలు మరువలేనివని రాష్ట్ర కో ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని సి.గుడిపాడు హైస్కూల్‌లో విస్సన్నపేట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో గుండె, కిడ్నీ, కంటి, దంత వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు ఇవ్వడం హర్షణీయమన్నారు. ఈ సందర్భంగా విస్సన్నపేట లయన్స్ క్లబ్ కార్యాయానికి మరమ్మతుల నిమిత్తం పుట్టగుంట వెంకట సతీష్ కుమార్ రూ.లక్ష అందచేశారు. అనంతరం 300 మందికి వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ విస్సంపల్లి ప్రశాంతి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పుచ్చకాయల సుబ్బారెడ్డి, ఉప సర్పంచ్ మందపాటి రఘుపతిరెడ్డి, ఆంధ్ర ఆస్పత్రి డాక్టర్లు అచ్యుతరావు, రమేష్, అమరావతి నేత్ర వైద్యులు కృష్ణారావు, దుహిత దంత వైద్యులు లావణ్య, ప్రియాంక, మణిపాల్ క్యాన్సర్ నిర్ధారణ వైద్య బృందం, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జగన్ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరాలతో విజ్ఞానం

తిరువూరు: విద్యార్థులు వేసవిలో తమ అభిరుచికి అనుగుణంగా నైపుణ్యాలు పెంపొందించుకోడానికి అవసరమైన శిక్షణ పొందాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ వల్లభనేని రవీంద్ర తెలిపారు. స్థానిక బోస్ సెంటర్‌లో జనవిజ్ఞాన వేదిక ఏర్పాటు చేయనున్న వేసవి శిక్షణా శిబిర ప్రచార కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. ఈ నెల 5 నుంచి స్పోకెన్ ఇంగ్లిషు, ఇంద్రజాల ప్రదర్శనల్లో ఉచిత శిక్షణను జనవిజ్ఞాన వేదిక ఏర్పాటు చేసిందని, వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని రవీంద్ర సూచించారు. జేవీవీ ప్రతినిధులు రాంప్రదీప్, బి.వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతులు

తిరువూరు: స్థానిక ఒకటో శ్రేణి శాఖా గ్రంథాలయంలో ఈ నెల 8 నుంచి ఉచిత వేసవి శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నట్లు గ్రంథాలయాధికారి కె.పద్మావతి తెలిపారు. చిత్రలేఖనం, స్పోకెన్ ఇంగ్లిష్, తెలుగు, గణితం, సైన్స్, జనరల్ నాలెడ్జ్, బొమ్మల తయారీ, మెడిటేషన్ తదితర అంశాల్లో శిక్షణ ఉంటుందని ఇస్తామన్నారు. ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం వరకు ఈ తరగతులు కొనసాగుతాయని తెలిపారు. 10 నుంచి 15 ఏళ్లలోపు విద్యార్థులు పాల్గొనాలని సూచించారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

తిరువూరు: తిరువూరు ఐడియాస్ సేవాసంస్థలో వేసవి శిక్షణా శిబిరంలో గురువారం బాలబాలికలు ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. డ్యాన్స్, మ్యూజికల్ చైర్స్, గన్‌షాట్స్, బాస్కెట్ బాల్ పోటీల్లో పాల్గొన్నారు. మెదడుకు పదును పెట్టే పజిల్స్, సుడోకు తదితర గేమ్స్ కూడా విద్యార్థులకు నేర్పుతున్నట్లు ఐడియాస్ డైరెక్టర్ అవ్వారి శౌరి తెలిపారు.

లక్ష్మీ నరసింహస్వామికి చందనాలంకరణ

పెనుగొలను(గంపలగూడెం): గంపలగూడెం మండలం పెనుగొలను బోటి మీదవేంచేసి ఉన్న శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో గురువారం స్వామి జయంతి సందర్భంగా స్వామి వారిని చందనంతో వైభవంగా ఆలంకరించారు. ఆలయ అర్చకుడు వి.వెంకటేశ్వర స్వామి ఆధ్వర్యంలో ముందుగా భక్తులచే శ్రీ నరసింహస్వామి చెంచులక్ష్మీ, రాజ్యలక్ష్మీ అమ్మవార్లకు శంఖు, చక్ర సహస్ర ధార ద్వారా పంచామృతాలు, వివిధ రకాల పండ్ల రసాలతో అభిషేకాలు జరిపారు. మూలవిరాట్ విగ్రహాలను చందనంతో అలంకరించారు. ఆలయ కమిటీ కన్వీనర్ పరుచూరు హరి మాధవగుప్తా, భక్తులు పాల్గొన్నారు.

నీట్, ఎంసెట్ తరగతులను వినియోగించుకోవాలి



విస్సన్నపేట: స్థానిక ప్రతిభా కళాశాలలో ఎంసెట్, నీట్‌కు సంబంధించి నిర్వహిస్తున్న శిక్షణ కేంద్రాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని గురుకులం జాయింట్ సెక్రటరీ మొజ్జాడ రమణమూర్తి తెలిపారు. స్థానిక ప్రతిభా కళాశాలను జాయింట్ సెక్రటరీ గురువారం పరిశీలించారు. అనంతరం బీసీ ఇంటిగ్రేటెడ్ బాలుర వసతి గృహాన్ని సందర్శించి, సీఓఈకు ప్రాంగణం వద్ద ఉన్న స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన గురుకులాల కన్వీనర్ జాన్సన్ దేవరాజ్, ఓఎస్‌డీ విజయ్‌కుమార్, ప్రతిభా కళాశాల ప్రిన్సిపాల్ ఝాన్సీలక్ష్మి పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి



ఇబ్రహీంపట్నం: విజయవాడ కొత్తపేట పోలీస్‌స్టేషన్ నుంచి బదిలీపై వచ్చిన ఎస్ఐ విజయలక్ష్మి ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌లో గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌ను ఐతవరంలోని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పూలమొక్క అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తానని ఎస్ఐ చెప్పారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన ఎస్ఐ ఎస్.శ్రీనివాస్ రెడ్డిగూడెం ఎస్‌హెచ్‌వోగా బదిలీపై వెళ్లారు. స్టేషన్ సీఐ పి.శ్రీను, సిబ్బంది ఎస్ఐ విజయలక్ష్మికి అభినందనలు తెలిపారు.

వైభవంగా విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ట



పెద్దకొమిరలో ముత్యాలమ్మ దేవతకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు

పెద్దకొమిర(గంపలగూడెం): మండల పరిధిలోని పెద్దకొమిరలో నూతనంగా నిర్మించిన ఆలయాల్లో విగ్రహ ప్రతిష్ట, శ్రీవెంకటాచలస్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠా కార్యక్రమాలను గురువారం వైభవంగా నిర్వహించారు. వినగడప పంచముఖసుందర హనుమత్ పీఠం అర్చకులు అరిపిరాల అప్పయ్యశాస్త్రి ఆధ్వర్యంలో ఆర్చక బృందంచే గ్రామంలోని శ్రీవెంకటాచలస్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ట, దాసాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట, నూతన ఆలయంలో ముత్యాలమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్టను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముత్యాలమ్మకు భక్తులు పొంగళి వండి నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామ ఆడపడుచులు, బంధువులు తరలిరావడంతో పూర్తిగా పండుగ వాతావరణం నెలకొంది. ఆడపడుచులకు తల్లిదండ్రులు, సోదరులు పసుపు కుంకమలను అందజేశారు. మధ్యాహ్నం నిర్వహించిన మహా అన్నదానంలో భక్తులు వేలాదిగా పాల్గొన్నారు. కమిటీ సభ్యులు తగిన ఏర్పాట్లు గావించారు. ఎస్ఐ రాంబాబు పర్యవేక్షణలో పోలీసులు తగిన బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

పారిశుద్ధ్యంపై శ్రద్ధ వహించాలి



గంపలగూడెంలో మాట్లాడుతున్న ఈఓపీఆర్డీ బాబూరావు, పక్కన ఎంపీడీఓ పిచ్చిరెడ్డి

గంపలగూడెం: జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు ఆదేశానుసారం గ్రామాల్లో పారిశుద్ధ్యంపై సచివాలయ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ప్రత్యేక పారిశుద్ధ్య పనులపై సచివాలయ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాలకు శివారున సుస్వాగతం, ధన్యవాదాలు బోర్డులను తప్పక ఏర్పాటు చేయాలన్నారు.

ప్రతి రోజు పర్యవేక్షించాలి..

ఈఓపీఆర్డీ డీ బాబూరావు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రధాన రహదారుల వెంట పేరుకుపోయిన చెత్తను వెంటనే తొలగించాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు ప్రజలు రోడ్లపైన చెత్తాచెదారం పడవేయకుండా పర్యవేక్షించాలని సూచించారు. ప్రతి రోజు ఉదయం 6 నుంచి 10గంటల వరకు తప్పకుండా కార్యదర్శులు పారిశుద్ధ్యంపై చర్యలు తీసుకోవాలని సూచించారు. చేపట్టే పనులకు సంబంధించి ఫొటోలు అప్‌లోడ్ చేయాలన్నారు. నిర్లక్ష్యం వహించిన వారిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. కొందరు సిబ్బంది ముందు రోజు తీసిన ఫొటోలను అప్‌లోడ్ చేయడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

రుణాల రికవరీలో రైతుల తోడ్పాటు అభినందనీయం

తునికిపాడు(గంపలగూడెం): ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల ద్వారా తీసుకున్న వ్యవసాయ రుణాలను సకాలంలో చెల్లించే విషయంలో రైతుల నుంచి అందుతున్న తోడ్పాటు, సహకారం అభినందనీయమని గంపలగూడెం కేడీసీసీ బ్యాంకు చీఫ్ మేనేజర్ శ్రీనివాసరావు అన్నారు. తునికిపాడు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో మెంబర్ లెవెల్లో 2022–23 ఆర్థిక సంవత్సరానికి 456 మంది రైతులు రూ.7.72 కోట్ల రుణాలను నూరు శాతం చెల్లించడంపై ఆయన అభినందించారు. ఈ సందర్భంగా బ్యాంకులో నిర్వహించిన కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు వేల్పుల చిన్న పిచ్చియ్య, సీఈఓ పి.మోహన్‌రావులను అభినందించారు. సొసైటీ వరుసగా ఆరో ఏడాది నూరు శాతం రుణాలు వసూలు చేశారని చీఫ్ మేనేజర్ కొనియాడారు. రైతుల నుంచి రుణాలను వసూలు చేయడంతో పాటు కోరిన వారికి తిరిగి 15 రోజుల్లో రుణాలు మంజూరు చేస్తామన్నారు. సొసైటీ అధ్యక్షుడు వేల్పుల చిన్న పిచ్చియ్య మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అందజేస్తున్న చేయూత కారణంగా రైతులకు మేలు జరిగి సకాలంలో రుణాలు చెల్లించగలుగుతున్నారన్నారు. బ్యాంకు అధికారులు రైతులకు తిరిగి రుణాలను సకాలంలో అందజేయాలని సూచించారు. మేనేజర్ కంచర్ల కనకదుర్గ, సూపర్‌వైజర్ మల్లాది ఏసోబు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

జెడ్పీటీసీ ప్రతాప్‌కు అభినందనలు



జెడ్పీటీసీ ప్రతాప్‌ను సన్మానిస్తున్న విద్యావేత్తలు, నేతలు

ముసునూరు: విద్య, సామాజిక, సాంస్కృతిక రంగాల్లో 15 ఏళ్లుగా విశేష సేవలు చేస్తూ జెడ్పీటీసీ సభ్యుడు, మండల గ్రామ సచివాలయాల కన్వీనర్‌గా విజయ వంతంగా పని చేస్తూ, ఇటీవల గౌరవ డాక్టరేట్‌ను అందుకున్న ముసునూరు జెడ్పీటీసీ డా.వరికూటి ప్రతాప్‌ను పలువురు అభినందించారు. వైఎస్సార్ సీపీ కాట్రేనిపాడు గ్రామ అధ్యక్షుడు కంబాల రాంబాబు అధ్యక్షతన లోపూడి ఆశ్చర్య పాఠశాలలో గురువారం ముసునూరు, నూజివీడు మండలాల, పట్టణ వైఎస్సార్ సీపీ నేతలు, విద్యావేత్తలు శాలువలతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికలను బహూకరించారు. కార్యక్రమంలో తొమ్మండ్రు యేషయా, కొలికిపాము వందనం, టి.రమేష్, కొలికిపాము ప్రకాష్, ఉయ్యూరు రాముడు, కంబాల దాసు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

జగనన్న పాలవెల్లువ కేంద్రాలను సక్రమంగా నిర్వహించాలి



గంపలగూడెంలో మాట్లాడుతున్న ప్రసన్నలక్ష్మి తదితరులు

గంపలగూడెం: జగనన్న పాలవెల్లువ కేంద్రాలను సక్రమంగా నిర్వహించాలని ఎన్టీఆర్ జిల్లా జగనన్న పాలవెల్లువ పథకం నోడల్ అధికారి వైవీ ప్రసన్నలక్ష్మి తెలిపారు. గంపలగూడెం వైఎస్సార్ క్రాంతిపథం కార్యాలయంలో ఆమె గురువారం జగనన్న పాలవెల్లువ పథకంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలంలో 19 పాలవెల్లువ కేంద్రాలు ఏర్పాటు చేయగా నాలుగు కేంద్రాల్లో పాలసేకరణ పట్ల ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. అన్ని కేంద్రాల్లో పాలసరఫరా పెరిగేలా అధికారులు, సిబ్బంది కృషి చేయాలన్నారు. ఆయా కేంద్రాల నిర్వహణలో సమస్యలను ఆమె అడిగి తెలుసుకున్నారు. మహిళా పాడి రైతులను చైతన్యపరచి ప్రతి ఒక్కరూ పాలవెల్లువ కేంద్రాలకు పాలు సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం పాలవెల్లువ కేంద్రాల్లో పాలుపోసే రైతులకు అందజేస్తున్న వసతులను, సౌకర్యాలను వివరించాలన్నారు. తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి, ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి, ఏపీఎం నాగరాజు, పశువైద్యులు అభిలాష్, సాయికృష్ణ, వెలుగు మిత్రలు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

రాజకీయ ఉనికి కోసమే ఉమా దిగజారుడుతనం

ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి

మైలవరం: తడిసిన ప్రతి ధాన్యపు గింజ కొనుగోలు చేస్తామని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ స్పష్టంగా ఆదేశాలు ఇచ్చారని, ధాన్యం కొనుగోలు తెలిసే మాజీ మంత్రి దేవినేని ఉమా మార్కెట్ యార్డు వద్ద హైడ్రామా నడిపారని ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి తెలిపారు. మైలవరం మార్కెట్ యార్డులో ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి గురువారం మాట్లాడుతూ అధికారం కోల్పోయిన ఉమాకు పిచ్చిపట్టిందని, రాజకీయ ఉనికి కోసమే దిగజారుతున్నాడని అన్నారు. ఎమ్మెల్యే ఎప్పటికప్పుడు అధికారులతో మాట్లాడి తగు చర్యలు చేపడుతున్నారన్నారు. మొక్కజొన్న కొనుగోలుకు కూడా మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఉమా మంత్రిగా ఉన్నప్పుడు అతని కోటరీ మాఫియా ద్వారా కోట్లాది రూపాయలు అవినీతికి పాల్పడిన నైజమని, ఇప్పుడు అవినీతి సొమ్ము ఆర్జించుకునే వీలులేక పిచ్చెక్కి రోడ్ల మీద పడుతున్నాడన్నారు. ఉమా వదిన ఎలా చనిపోయిందో మీడియాకు చెప్పాలన్నారు. ఇకనైనా ఉమా ప్రవర్తన మార్చుకోకుంటే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

ఘనంగా వినాయక విగ్రహ ప్రతిష్ఠ

చాట్రాయి: మండలంలోని చిత్తపూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ వరహసిద్ధి వినాయక విగ్రహ ఆలయ ప్రతిష్ఠ గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఏపీ కో ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం 5 వేల మందికి అన్నదానం చేశారు.

ప్రజలకు అసౌకర్యం కలిగించవద్దు



ఇబ్రహీంపట్నం: మామిడి వ్యాపారులు ప్రజలకు అసౌకర్యం కలగకుండా వ్యాపారాలు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు సూచించారు. ఇబ్రహీంపట్నం రింగ్‌సెంటర్ సమీపంలో హైవే పక్కన మామిడి వ్యాపారులను గురువారం ఆయన ప్రత్యేకంగా కలిశారు. మామిడి కాయల చెత్తను రోడ్లు పక్కన వేయరాదన్నారు. ప్రత్యేక ప్రదేశాల్లో మాత్రమే వేయాలన్నారు. అనంతరం ఆల్పా దుకాణాల వద్ద పారిశుద్ధ్యం పనులు, హైవే పక్కన పేరుకు పోయిన చెత్త జేసీబీతో తొలగింపు పనులను ఆయన పరిశీలించారు. కార్మికులకు పలు సూచనలు చేశారు.

రేషన్ బియ్యం తరలిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు

రోలుపడి(తిరువూరు): మండలంలోని రోలుపడిలో ఎండీయూ వాహనాల్లో అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తుల్ని పౌరసరఫరాల అధికారులు అదుపులోకి తీసుకున్నారు. తహసీల్దార్ సురేష్ బాబు తెలిపిన వివరాల ప్రకారం రోలుపడి, నూరవరంలలో ఎండీయూ వాహనాల ఆపరేటర్లు ఆనం రమేష్, దారెల్లి విజయభాస్కర్‌లు కార్డుదారుల నుంచి బియ్యం కొనుగోలు చేసి వాహనాల్లో తరలిస్తున్నట్లు సమాచారం అందుకుని గురువారం తనిఖీలు చేశారు. 38 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని వాహనాలను సీజ్ చేశామని, ఇద్దరిపై 6–ఏ కింద కేసు నమోదు చేశామని తెలిపారు. నిందితులపై క్రిమినల్ కేసుల నమోదుకు పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

పచ్చిరొట్ట విత్తనాలకు ఆర్బీకేల్లో నమోదు



నరసాపురం(విస్సన్నపేట): పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగు, జనుము, పిల్లిపెసర్లు కావాల్సిన రైతులు ముందుగానే సంబంధిత రైతు భరోసా కేంద్రాల్లో ఉద్యాన సహాయకులను సంప్రదించి నమోదు చేయించుకోవాలని ఏవో రాజ్యలక్ష్మి తెలిపారు. నరసాపురం గ్రామంలో రైతుభరోసా కేంద్రాన్ని ఏవో గురువారం సందర్శించారు. సంబంధిత రికార్డులు పరిశీలించారు. పీఎం కిసాన్ 14వ విడత నగదుకు ఈ–కేవైసీ పూర్తికాని రైతులు ఈ నెల 20లోగా ఈ–కేవైసీ చేయించుకోవాలని ఏవో చెప్పారు.

నేడు పోతురెడ్డిపల్లిలో 'చిన్నారి భవిత'

నూజివీడు: మండలంలోని పోతురెడ్డిపల్లిలో సబ్‌కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ చిన్నారి భవిత కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు ఎంపీడీవో సుందరి గురువారం తెలిపారు. దీనిలో భాగంగా సెలబ్రేట్ గర్ల్ చైల్డ్ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. బాలింతలకు వెల్‌కమ్ బేబీ కిట్ అందించడం, సుకన్య సమృద్ధి యోజన ఖాతా నమోదు చేయడం, జనన నమోదు పత్రాన్ని అందించడం, పోషణపై కరపత్రం అందిస్తామని చెప్పారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
తిరువూరు డివిజన్
99510 20399 (తిరువూరు),
99122 20544 (నూజివీడు)
90102 23734 (మైలవరం)
Office mail : sakshiads@gmail.com